

హెచ్ఐటిఎస్ ఉపాధ్యక్షులుగా అరవింద్



ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని వేగవరంలో ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల హేలాపురి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల (హెచ్ఐటిఎస్) నూతన వైస్ ప్రెసిడెంట్‌గా విద్యావేత్త, ఎక్సీల్లా ఎడ్యుకేషన్ గ్రూప్ విద్యాసంస్థల అధినేత అరసవిల్లి అరవింద్ బాధ్యతలు స్వీకరించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. హేలాపురి టెక్నాలజీ అండ్ సైన్స్ (హెచ్ఐటిఎస్) ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం సత్తుపల్లిలోని శ్రీ గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీకి అనుబంధ సంస్థగా ఉన్న సంగతి తెలిసిందే. పాలకవర్గ ఉపాధ్యక్షులుగా అరసవిల్లి అరవింద్ రావడంతో నూతన వన్నె వచ్చిందన్నారు. ఈసందర్భంగా పలువురు అరవింద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

'చింత'లపూడి..!

నిధులలేమితో ముందుకు సాగని ఎత్తిపోతల పథకం పనులు
పరిష్కారంకాని భూసేకరణ సమస్యలు
అరకొరగానే పంప్‌హౌస్ పనులు
రూ.9,800 కోట్లకు పెరిగిన అంచనా విలువ
రాష్ట్ర బడ్జెట్‌లో నిధులిస్తేనే పనులు ముందుకు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చింతలపూడి ఎత్తిపోతల పథకం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిధుల కేటాయింపుల్లో నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ఒకపక్క అంచనా విలువ పెరిగిపోతుండటంతో ఇప్పట్లో చింతలపూడి ప్రాజెక్టు పూర్తయ్యేనా అనే చర్చ రైతుల్లో పెద్దఎత్తున సాగుతోంది. మెట్టప్రాంతంలో రైతులకు అత్యంత మేలుచేసే సాగునీటి ప్రాజెక్టు చింతలపూడి ఎత్తిపోతల పథకం. ఈ ప్రాజెక్టు 2008లో ప్రారంభమైంది. తొలుత రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా రూ.1,701 కోట్లు అంచనాలతో పనులు ప్రారంభించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాకు విస్తరించారు. దీంతో ప్రాజెక్టు అంచనా విలువ రూ.4,909.80 కోట్లుగా ప్రణాళిక రూపొందించారు. ప్రాజెక్టు విస్తరణతో మరో 2.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించినున్నట్లు ప్రభుత్వం తెలిపింది. గత ప్రభుత్వం 2018కి ఈ ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్లు ప్రకటించింది. ప్రాజెక్టు మాత్రం పూర్తి కాలేదు. ఈ ప్రాజెక్టుకు భూములిచ్చే రైతులు తమకు న్యాయమైన పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని అప్పటి ప్రభుత్వాన్ని కోరారు. రైతుల నుంచి పెద్దఎత్తున నిరసనలు సైతం వ్యక్తమయ్యాయి. గత ప్రభుత్వం రైతుల గోడు ఏమాత్రం పట్టించుకోలేదు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే చింతలపూడి ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని ప్రస్తుత సిఎం జగన్ హామీ ఇచ్చారు. ఇప్పటికీ రైతులకు న్యాయం చేయని పరిస్థితి నెలకొంది. దీంతో చింతలపూడి మండలంతోపాటు పలుచోట్ల ఇప్పటికీ భూసేకరణ సమస్యలు పరిష్కారం కాని పరిస్థితి కొనసాగుతోంది. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టు పూర్తిగా పడకేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నత్తనడకన ప్రాజెక్టు పనులు

చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు గత మూడేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు సైతం సక్రమంగా లేని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకూ ఈ ప్రాజెక్టు పనులు 62 శాతం పూర్తయినట్లు లెక్కలు చెబుతున్నాయి. సుమారు రూ.నాలుగు వేల కోట్లు వరకూ ఖర్చు పెట్టారు. ఈ జిఎస్‌టి అమలుతో ప్రాజెక్టు అంచనా విలువ సైతం భారీగా పెరిగింది. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.4,980 కోట్లు నుంచి రూ.9,800 కోట్లకు చేరుకుంది. ప్రాజెక్టు ఆలస్యమవుతున్న కారణంగా బడ్జెట్ వ్యయం పెరిగిపోతుంది. 106 కిలోమీటర్ల మేర ఉన్న మెయిన్ కెనాల్ ఇంకా పూర్తి కావాల్సి ఉంది. మరో రూ.1500 కోట్లు ఖర్చు చేస్తే మెయిన్ కెనాల్ పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. అది జరిగితే కొంతమేర రైతులకు న్యాయం జరిగే అవకాశం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. పంప్‌హౌస్‌కు సంబంధించిన పనులు సైతం అంతంతమాత్రంగానే జరిగాయి. చింతలపూడి ప్రాజెక్టు పనుల జాప్యం విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. భూసేకరణకు సంబంధించి కోర్టు సమస్యలు సైతం 'ఎక్కడ వేసిన గొంగళి' అక్కడే ఉన్నట్లు ఉండిపోయాయి. వైసిపి పాలనలో పూర్తిస్థాయి చివరి బడ్జెట్ త్వరలో ప్రవేశ పెట్టబోతున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా చింతలపూడి ప్రాజెక్టుకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తారా అనే చర్చ నడుస్తోంది. ఈ ప్రాజెక్టును ఇప్పట్లో పూర్తి చేస్తారా అనే సందేహాలు సైతం రైతుల్లో నెలకొన్నాయి.

రెండో రోజూ నామినేషన్లు నిల్

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి రెండో రోజైన శుక్రవారం కూడా నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైన సంగతి తెలిసిందే. శనివారం శివరాత్రి, తర్వాత ఆదివారం సెలవు దినాలు కావడంతో ఈ నెల 20వ తేదీ సోమవారం నుంచి నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ



పట్టిసీమలో పర్యటిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు/పోలవరం

శివరాత్రి సందర్భంగా జిల్లావ్యాప్తంగా పలు ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ తెలిపారు. ఈ నెల 18వ తేదీ శనివారం శివరాత్రి సందర్భంగా పట్టిసీమ, బలివే, కలిదిండిల్లో ప్రముఖ శివాలయాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆయన పట్టిసీమ శైవక్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. క్యూలైన్లు, ఇసుకలో ఏర్పాటు చేసిన రోడ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పట్టిసీమలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా రెవెన్యూ, పిడబ్ల్యూడి, పోలీసు, విద్యుత్, వైద్యఆరోగ్య శాఖ ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నదుల్లో స్నానాలు చేసే సమయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, జలాశయాల్లో మునిగి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఆలయాల వద్ద తాత్కాలికంగా పోలీసు కంట్రోల్ రూంలను ఏర్పాటు చేస్తున్నామని, ఎవరికైనా ఏదైనా సమస్య వస్తే అక్కడి పోలీసు కంట్రోల్ రూమ్‌లో సంప్రదించి సహాయం పొందాలని కోరారు. మహిళలు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒంటరిగా విడిచిపెట్టొద్దని సూచించారు. ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని, దొంగతనాలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్‌పి వివరించారు. ఎస్‌పి వెంట పోలవరం డిఎస్‌పి లతా కుమారి, జంగారెడ్డిగూడెం ఇన్‌ఛార్జి డిఎస్‌పి కెవి.సత్యనారాయణ, డిటిసి డిఎస్‌పి కె.ప్రభాకర్‌రావు, ఎస్‌బి సిఐ వి.రవికుమార్, పోలవరం సిఐ విజయబాబు తదితరులు ఉన్నారు.



విద్యార్థినుల ప్రదర్శన

హెల్మెట్ ఆవశ్యకతపై వినూత్న ప్రదర్శన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల సందర్భంగా చోటుచేసుకునే మరణాలను వివరిస్తూ స్థానిక త్రివేణి కళాశాల విద్యార్థులు చేపట్టిన వినూత్న ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. శుక్రవారం త్రివేణి కళాశాల విద్యార్థులు స్థానిక అశ్వరావుపేట రోడ్డు కాకర జంక్షన్ వద్ద హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతను ప్రదర్శించారు. తొలుత పాటలకు డ్యాన్స్ చేస్తూ ప్రదర్శన సాగించారు. అనంతరం యువత అతివేగం, మద్యం మత్తులో వాహన ప్రమాదాలకు గురైనప్పుడు జరిగే ప్రాణనష్టం వల్ల బాధిత కుటుంబాలు అనుభవించే మానసిక క్షోభను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. కళాశాల కరస్పాండెంట్ మురళీ, రోటరీ క్లబ్ అధ్యక్షులు దాకారపు కృష్ణ మాట్లాడుతూ ఇటీవల పట్టణ పరిసర ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రాణనష్టం చోటుచేసుకుందని గుర్తు చేశారు. తల్లిదండ్రులు బాధ్యత వహించి యువత చెడు మార్గాల వైపు మొగ్గు చూపకుండా శ్రద్ధ చూపాలని కోరారు. త్రివేణి కళాశాల సిబ్బంది నరేష్, నాగార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో విద్యార్థులు

వ్యాయామ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - దెందులూరు


రక్తదానం చేయడం వల్ల పోయే ప్రాణాలు కాపాడగలుగుతామని గోపన్నపాలెంలోని సీతారామ వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.నతానియేలు అన్నారు. శుక్రవారం వ్యాయామ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హేలాపురి, ఇండియన్ రెడ్‌క్రాస్, శ్రీ సీతారామ వ్యాయామ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పలువురు ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు రక్తదానం చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలూరు, ఇండియన్ రెడ్‌క్రాస్, వ్యాయామ కళాశాల ప్రతినిధులు విద్యార్థుల ద్వారా సేకరించిన రక్తాన్ని అవసరమైన వారికి అందజేస్తామని తెలిపారు. రక్తదానం చేసిన విద్యార్థులను ప్రిన్సిపల్ నతానియేలు అభినందించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు డి.గణేష్‌బాబు, వెంకటేశ్వరరావు, పి.ఆదినారాయణ, కణాల శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ పిఆర్ఒ రమణలను కళాశాల ప్రిన్సిపల్ నతానియేల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పివికెడి.ప్రసాద్, అధ్యాపకులు శ్యామల తదితరులు ఘనంగా సన్మానించారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అధిక దిగుబడులు ఆశించి రైతులు మోతాదుకు మించి ఎరువులు వినియోగించడం వల్ల దుష్ఫలితాలు వస్తున్నాయని మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు అన్నారు. మండలంలోని రాజుపోతేపల్లి, తెడ్లం గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న, వేరుశనగ పంటలను పరిశీలించారు. రైతులకు సూచనలు, సలహాలు అందించారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగించొద్దని సూచించారు. తద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని, ఆదాయం పెరుగుతుందని అన్నారు. ప్రకృతిలో రైతుకు అవసరమైన పురుగులు ఉన్నాయని, పురుగుమందులు విపరీతంగా పిచికారీ చేస్తే చనిపోతాయని అన్నారు. మిత్ర పురుగులను సంరక్షించుకోవాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకురాలు డి.స్వప్న ఉన్నారు.





సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిఎంహెచ్ఒ

గురుకుల పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

గుట్టుచప్పుడు కాకుండా పాఠశాలలోనే చికిత్స
విద్యార్థులకు ఎంఎల్ఎ, డిఎంహెచ్ఒ పరామర్శ



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ ఎలిజా

ప్రజాశక్తి - చింతలపూడి

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 16 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన శుక్రవారం ఆలస్యంలోకి వెలుగులోకి వచ్చింది. ఈ నెల 16వ తేదీ గురువారం రాత్రి భోజనం తరువాత ఐదారుగురు విద్యార్థులు వాంతులు, కడుపునొప్పితో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే పాఠశాలలో నర్సు వద్దకు వెళ్లగా మందులిచ్చి చికిత్స అందించారు. అయితే తర్వాత అస్వస్థతకు గురైన విద్యార్థుల సంఖ్య క్రమేపీ పెరగడంతో సిబ్బంది అప్రమత్తమై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పాఠశాలలోనే అత్యవసర వైద్య సేవలను అందించారు. శుక్రవారం ఉదయం నుంచి విషయం బయటకు రాకుండా చికిత్స సాగించారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల సంఖ్య 15కు చేరడంతో మధ్యాహ్నం సమయంలో జిల్లా వైద్యాధికారి ఎం.నాగేశ్వరరావు అక్కడికి చేరుకుని విద్యార్థులను పరీక్షించారు. నీరు, ఆహారం శాంపిళ్లను సేకరించారు. తహశీల్దార్ కృష్ణజ్యోతి పాఠశాలకు వచ్చి విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశించారు.

ఎంఎల్ఎ పరామర్శ

చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా పాఠశాల వద్దకు చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాత్రి నుంచి విద్యార్థులకు అందుతున్న వైద్యంపై వైద్యాధికారి మానసను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్ఎ వెంట ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకీరెడ్డి, జెడ్‌పిటిసి మోలుగుమాటి నీరజాసుధాకర్, సిటీమెడికల్ దుర్గారావు, కొప్పుల నాగు, ఇతర ప్రముఖులు ఉన్నారు.


నీళ్ల కుండీలో పసికందు మృతదేహం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఒక పాడుబడిన ఇంట్లోని నీళ్ల కుండీలో పసికందు మృతదేహం లభ్యమైంది. దుర్వాసన రావడంతో స్థానికులు పసికందు మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఆ ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించారు. మున్సిపల్ అధికారులకు సమాచారం అందించి అక్కడ నుంచి మృతదేహాన్ని తొలగించారు. గతంలో ఇక్కడ క్యారీబ్యాగ్‌లో శిశువు మృతదేహం లభించిన సంగతి తెలిసిందే. సమీప ఆసుపత్రుల్లో పురిట్లోనే మృతి చెందిన శిశువులను క్యారీబ్యాగ్‌లో కట్టి డ్రెయినేజీల్లో వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు

మీడియా సంస్థలపై కేంద్రం తీరు దారుణం

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన ధర్నా



డిఆర్ఒకు నేతల వినతి

ప్రజాశక్తి - ఏలూరు

మీడియా సంస్థలపై కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరి అవలంబించడం, భౌతికదాడులకు పాల్పడటం దుర్మార్గమని పలువురు అన్నారు. బిబిసి సంస్థపై కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యాన స్థానిక కలెక్టరేట్ వద్ద శుక్రవారం పాత్రికేయులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు మాట్లాడుతూ గుజరాత్‌లో జరిగిన గోద్రా మారణ హోమంపై బిబిసి డాక్యుమెంటరీ రూపొందించడంతో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఐటి సంస్థలచే బిబిసిపై దాడులు చేయించడం సరైన చర్య కాదన్నారు. కార్యక్రమంలో నేతలు జబీర్, కె.సోమశేఖర్, పి.గంగరాజు, ఎంఎస్ఎస్.ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రుషీరావు, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నష్టపోతున్న వంగ రైతులను ఆదుకోవాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్



తోటను పరిశీలిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మార్కెట్‌లో ధర రాక నష్టపోతున్న వంగ రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలో సంఘం నాయకులు పర్యటించి వంగతోటలను పరిశీలించారు. వంగ రైతులకు వస్తున్న నష్టాలను అడిగి తెలుసుకున్నారు. కూలీ ఖర్చులు కూడా రాకపోవడంతో వంకాయలు కోయకుండా చెట్లకే వదిలేస్తున్నామని వంగ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కిలో వంకాయలకు మార్కెట్‌లో రైతుకు రూ.5 మాత్రమే వస్తున్నాయన్నారు. ఎకరాకు రూ లక్ష వరకు పెట్టుబడి పెట్టి వంగ తోటలను సాగు చేస్తుంటే కోత కూలీ ఖర్చులు కూడా రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోతున్న వంగ రైతులకు కనీస ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కూరగాయల రైతు సంఘం జిల్లా నాయకులు కట్టా భాస్కరరావు మాట్లాడుతూ కూరగాయల రైతులు నష్టాల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంగిడిగూడెం, ఎం.నాగులపల్లి తదితర గ్రామాల్లో రైతులకు గత మూడు సంవత్సరాలుగా దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కూరగాయల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్రం రాంబాబు, గుర్రం పాపారావు, పలువురు కూరగాయల రైతులు పాల్గొన్నారు.

పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో ఆస్తి పన్ను మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేశామని మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మొండి బకాయి వసూళ్లపై పట్టణంలో ఐదో రోజు పర్యటించారు. ఈ క్రమంలో రూ.12 లక్షలు నగదు, రూ.రెండు లక్షలు చెక్కు రూపములో మొండి బకాయిలు వసూలైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎన్.సుబ్బారావు, మేనేజర్ కె.వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.రమణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ



చొదిమెళ్లలో ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దోమల వ్యాప్తిని అరికట్టాలంటే పరిసరాల పరిశుభ్రత పాటించడమే ముఖ్యమని జిల్లా ఇన్‌ఛార్జి జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ముళ్లగిరి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక 27వ డివిజన్ చొదిమెళ్లలో కార్పొరేటర్ బత్తిన విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ దోమల ద్వారా డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని హెచ్చరించారు. దోమలు ఎక్కువగా నీటి నిల్వ ప్రాంతాల్లో ఉంటాయని, ఇళ్లు, ఇళ్ల సముదాయాల్లో ఉన్నటు వంటి మూత లేని నీటితొట్లు, డ్రమ్ములు, టైర్లు, కొబ్బరి బొండాలు, ఫ్లవర్ వాజులు, పూల కుండీలు, రుబ్బురోలు, పగిలిపోయిన ప్లాస్టిక్ వస్తువులు, కుండలు వంటి వాటిలో ఎక్కువగా పెరుగుతాయన్నారు. వారానికి ఫైబడి నీరు నిలువ లేకుండా చూసుకోవాలని, పనికిరాని వస్తువులు తొలగించాలని సూచించారు. డెంగీ, మలేరియా పరీక్షలు ఉచితంగా చేస్తామని, మందులు ఉచితంగా అందిస్తామని చెప్పారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని. చెత్త చెదారాలను డ్రెయిన్లలో వేయొద్దని కోరారు. జ్వరం వస్తే స్థానిక సిబ్బంది సంప్రదించాలని సూచించారు. అనంతరం ఇంటింటా కరపత్రాలు పంచి ఫ్రైడే డ్రైడే కార్యక్రమం గురించి వివరిస్తూ ర్యాలీ సాగించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, ఎంపిహెచ్ఇఒ ఆర్.వెంకటరాజు, హెల్త్ అసిస్టెంట్ జోషిశ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పి అయేషా, ఎఎన్ఎంలు శ్యామల, సంధ్య, ఆశా కార్యకర్త సుందరమ్మ, ఉషారాణి, వాలంటీర్లు పాల్గొన్నారు.

మురికివాడల్లో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం



మాట్లాడుతున్న సోమయ్య

ప్రజాశక్తి - ఏలూరు

నగరంలో మురికివాడల్లో ప్రజల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా నాయకులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ నగర కమిటీ సమావేశం బి.సోమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ఏలూరులో ఏడు గ్రామాలు కలిశాక జనాభా మూడు లక్షల యాభై వేలు దాటిందన్నారు. మురికివాడల్లో పేదలు అనేక సమస్యలతో బాధపడుతున్నారన్నారు. వెంకటాపురం పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య, ఇందిరమ్మ కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు, శివారు ప్రాంతాల్లో ఇళ్ల పట్టాల సమస్యలు, టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీల్లో సౌకర్యాలు ఇలా అనేక సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, మున్సిపల్ పాలకవర్గం విఫలమయ్యాయన్నారు. నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఈ సమస్యలపై పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో నగర కమిటీ సభ్యులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, జి.రవికిషోర్, వివివివిఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీ సెక్రటరీల కొరత

సేవలందక ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని పలు పంచాయతీల్లో సెక్రటరీలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఉర్లగూడెం, యర్రగుంటపల్లి, సీతానగరం, తిమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు లేరు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు పలు సేవలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్‌ఛార్జి సెక్రటరీలు ఉన్నప్పటికీ ఎప్పుడూ అందుబాటులో ఉండలేకపోతున్నారు. వారి పంచాయతీలోని సమస్యలతోనే వారు సతమతమవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న సెక్రటరీ పోస్టులు భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ చిరు ధాన్య సంవత్సరం-2023 అంశంపై నెహ్రూ యువ కేంద్రం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల అధ్యక్షులు డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ వర్షాధార పంటలైన మిల్లెట్స్ ప్రాచీన కాలం నుంచి భారతదేశంలో వినియోగంలో ఉండేవని, వరి, గోధుమలు ఆ స్థానాన్ని ఆక్రమించాయని చెప్పారు. డాక్టర్ ఖాదర్ వలి కృషి ఫలితంగా మిల్లెట్స్‌కు పూర్వ వైభవం రాబోతుందని, భావితరాల ఆహార భద్రతకు చిరుధాన్యాలే ప్రత్యామ్నాయమని అన్నారు. అనంతరం జిల్లా యువజన అధికారి దూలం కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవగాహన కలిగి ఉండాలని, తద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.అజయ్‌కుమార్, అధ్యాపకులు వి.వెంకట్రావు పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న వైష్ణవి

అగ్ని ప్రమాద బాధితులకు వైష్ణవి చేయూత

ప్రజాశక్తి - కైకలూరు

అగ్ని ప్రమాద బాధితులకు ముదినేపల్లికి చెందిన అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి సాయం అందించారు. మండలంలోని ఆటపాకలో షార్ట్‌సర్క్యూట్‌తో గురువారం సంభవించిన అగ్ని ప్రమాదంలో జాన్‌పేటకు చెందిన పాలపర్తి యోబుకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. ఆ ఇంట్లో మూడు కుటుంబాల వారు అద్దెకు ఉంటున్నారు. వీరు గురువారం కూలి పనుల నిమిత్తం పనులకు వెళ్లారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో తాటాకిల్లు దగ్ధమైంది. వారిని వైష్ణవి శుక్రవారం పరామర్శించి ఒకొక్క కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, రూ.ఐదు వేల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో వేమూరి కిరణ్, న్యాయవాది తెరా విజయకుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని ఎంపిపి కొర్స పోసమ్మ అన్నారు. జీలుగుమిల్లిలో నూతనంగా నియమించిన సచివాలయ గృహ సారథులు, కన్వీనర్లకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా నియమించబడిన గృహ సారథులు, కన్వీనర్లు సచివాలయాల సేవలు అందరికీ అందించేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయో లేదో తెలుసుకుని వాటి పరిష్కర దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ వనమా రామకృష్ణ, వైసిపి సర్పంచులు చిర్రి జగదాంబ, సున్నం ఉషారాణి, కుంజా పార్వతి, సున్నం వరలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, ప్రసాద్, చక్రి, రాము, మొడియం రామచంద్రరావు, రాముడు, శ్రీను రాంపండు, అల్లూరి రత్నాజి, అరేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షునికి జయమంగళ పరామర్శ

ప్రజాశక్తి - మండవల్లి

రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న టిడిపి మండవల్లి మండల అధ్యక్షులు నారగాని వీర వెంకట నాగేశ్వరరావు (కొండ)ను మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ వెంకటరమణ శుక్రవారం పరామర్శించారు. వీరవెంకటనాగేశ్వరరావును ఆయన నివాసంలో మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ తన అనుచరులతో కలుసుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ రోడ్డుపై మనం ఎంత సక్రమంగా వెళ్లినా ఎదుటివారు సక్రమంగా వస్తారని, ప్రయాణం సుఖవంతంగా ఉంటుందనే గ్యారెంటీ లేకపోయిందన్నారు. ఎంతో జాగ్రత్తగా వాహనాన్ని నడిపినా ప్రమాదం జరగడం బాధాకరమన్నారు. తాను కూడా రోడ్డు ప్రమాదానికి గురై ఇబ్బందులు పడ్డానని గుర్తు చేశారు. నాగేశ్వరరావు త్వరగా కోలుకోవాలని కోరారు. పరామర్శించినవారిలో సయ్యపరాజు గుర్రాజు, ఖాదర్ భాష, కోనపురెడ్డి కోటేశ్వరరావు, ముళ్లపూడి సత్తిబాబు, రాజులపాటి యశోదనరావు, ఎలికే రాంబాబు, నంగడ్డ శివ, పళ్లెం వెంకటేశ్వరరావు, తిరుమల ఆంజనేయులు, రాఖీబా, ముక్కు పాండురంగారావు, నంగడ్డ శివాజీ, లక్ష్మణ, పరసా శ్రీను, అలీఖాన్, గౌతమ్ కుమార్ ఉన్నారు.



వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న వై.రామకృష్ణ

వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని బురజపల్లి, బుద్దులవారిగూడెం, కొల్లాయిగూడెం గ్రామాల్లో మొక్కజొన్న, పొగాకు బ్యారన్, నాటుపొగాకు క్షేత్రాలను జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నాటికి ఇ-క్రాప్ నమోదు పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.సుమలత, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గోపవరంలో 'ఇదేం ఖర్మ'...

ప్రజాశక్తి - కైకలూరు

మండలంలోని గోపవరంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు త్రినాధరాజు ఆధ్వర్యంలో నిర్వహించని కార్యక్రమంలో వైసిపి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, అరాచక పాలనను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు మాగంటి సురేష్, ప్రధాన కార్యదర్శి పాండురంగారావు, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, పట్టణ అధ్యక్షులు మహమ్మద్ జానీ పాల్గొన్నారు.

జయమంగళకు అభినందన

ప్రజాశక్తి - కైకలూరు

కైకలూరుకు చెందిన జయమంగళ వెంకటరమణ వైసిపిలో చేరి గురువారం రాత్రి ఆటపాకలోని ఆయన నివాసానికి వచ్చారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలనుంచి ఆయన అభిమానులు పెద్ద ఎత్తున శుక్రవారం ఉదయం జయమంగళ నివాసానికి చేరుకుని పూలమాలలు, శాలువాలతో అభినందించారు. కైకలూరుతో పాటు కొల్లేరు గ్రామాలనుంచి ఆయన అభిమానులు తరలివచ్చారు. ఆదివారం కైకలూరులో ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఫ్యాక్టరీ మురుగు నీటితో నరకం

రాయన చెరువు నీరు కలుషితం

పొలసానిపల్లి గ్రామ రైతుల ఆవేదన

ప్రజాశక్తి - నూజివీడు



ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మురుగు నీరు



నాశనమవుతున్న పంట

వాగులో వస్తున్న మురుగునీటి కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నూజివీడు మండల పరిధిలోని పొలసానిపల్లి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో ఉన్న ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడు గ్రామంలోని మోహన్ స్పిన్ టెక్ ఫ్యాక్టరీ, అందులో పని చేసే కార్మికులు నివాసం ఉండే క్వార్టర్స్ నుంచి వస్తున్న వ్యర్థ మురుగు జలాలతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పొలసానిపల్లి గ్రామానికి చెందిన రైతులు నారగాని శ్రీనివా సరావు, వేముల గోపా లస్వామి, రామకృష్ణ, గంగాధర్ తెలిపారు. మురుగు నీటిని మూడు నాలుగు కిలోమీటర్ల మేర పైపులైన్లు వేసి, అక్కడి నుంచి వాగులో కలపడం వల్ల రాయన చెరువులోకి కలిసి నీరు కలుషితం అవుతుందని చెబుతున్నారు. వాగులో వ్యర్థ మురుగు జలాలు ప్రవహించటం కారణంగా పక్కనే ఉన్న మలబారు, మొక్కజొన్న, జామ, కూరగాయలు వంటి సాగు విస్తీర్ణం రాను రాను తగ్గిపోతోందని తెలి పారు. మురుగునీటి ప్రవాహంతో వస్తున్న దోమల కారణంగా పంటల దిగుబడి, నాణ్యత తగ్గిపోయి, ఆదాయం గణనీయంగా పడిపోవడంతో తమ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడిందని వాపోయారు. వాగులో ఉన్న కలుషితమైన నీటిని సేవించడంతో పశువులు కూడా మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై సమస్య పరిష్కరించాలని ఫ్యాక్టరీ యజమానులను కోరగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు రైతులు వాపోతున్నారు. ఆరేళ్ల క్రితం నూజివీడు ఆర్‌డిఒకు వినతిపత్రం అందించినా స్పందించలేదని, ఇవే పరిస్థితులు కొనసాగితే తమ రైతు కుటుంబాలు మొత్తం జీవించే దారి లేక రోడ్డున పడటం మినహా మరొక మార్గం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సకాలంలో తమ సమస్య శాశ్వతంగా పరిష్కరించి పంట భూములను రక్షించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

యాత్రికులకు అసౌకర్యం కలగకూడదు

బలివే ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ ప్రసన్నవెంకటేష్



ఆలయ అధికారులతో కలెక్టర్

ప్రజాశక్తి - ముసునూరు

బలివే ఉత్సవాలకు వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులకు సూచించారు. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు రెండు లక్షలకు పైగా యాత్రికులు వస్తారని అంచనా అని చెప్పారు. మండలంలోని బలివేశ్రీరామలింగేశ్వరస్వామి ఉత్సవాల ఏర్పాట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఒక డిఎస్‌పి, ఆరుగురు సిఐలు, 21 మంది ఎస్‌ఐలు, 250 మంది కానిస్టేబుల్స్, 150 మంది ఎన్‌సిసి ట్రిబుల్ ఐటి విద్యార్థులు, సేవాదళం వంటి సిబ్బందితో పాటు వైద్య సిబ్బంది మూడు రోజులు మూడు షిఫ్టులుగా 24 గంటలు అందుబాటులో ఉంటామని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఎక్సైజ్ శాఖ, అగ్నిమాపక సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నాయని కలెక్టర్‌కు తెలిపారు. ఈ ఏడాది విఐపి కూపన్లు రద్దు చేసినట్లు ఆలయ ఇఒ టి.విశ్వేశరరావు తెలిపారు.

బలివే యాత్రికులకు ప్రసాద వితరణ

దెందులూరు :శివరాత్రి సందర్భంగా ముసునూరు మండలంలోని బలివే ఉత్సవాలకు వచ్చే భక్తులకు పెదవేగి మండలం విజయరాయిలోని బలివే అడ్డరోడ్డు వద్ద తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి చౌదరి ఆధ్వర్యంలో భారీ ప్రసాద వితరణకు ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చి స్వామి దర్శనం చేసుకుని వెళ్లే భక్తులకు ప్రత్యేకంగా బ్రాహ్మణులతో మూడు రకాల ప్రసాదాలను వండించి 50 వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, మజ్జిగ ప్యాకెట్లను, మంచినీటిని అందించే విధంగా ఏర్పాట్లు చేశామని గారపాటి చౌదరి చెప్పారు. బలివేతోపాటు పట్టిసీమ, తాడువాయి, కలిదిండిలలో కూడా భక్తులకు తపన ఫౌండేషన్ తరపున ప్రసాద వితరణ, మజ్జిగ ప్యాకెట్లను అందించనున్నట్లు గారపాటి చౌదరి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఏర్పాట్లను గారపాటి చౌదరి పరిశీలించారు.

ప్రభుత్వ కళాశాలల్లో 'ఓపెన్ డే'

ప్రజాశక్తి - ఉంగుటూరు



నారాయణపురం కళాశాలలో..

నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం శుక్రవారం ఓపెన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో విద్యాబోధన నాణ్యత ప్రమాణాలను విద్యార్థులకు భౌతికంగా ప్రదర్శించి, డిగ్రీ స్థాయిలో ఏ ఏ పాఠ్యాంశాలను బోధిస్తున్నారో వివరించి, కళాశాలలో గల కంప్యూటర్ ల్యాబ్, ఇ-క్లాస్ రూమ్, వర్చువల్ క్లాస్ రూమ్, రసాయన శాస్త్ర, జంతు శాస్త్ర, భౌతిక శాస్త్ర, వృక్షశాస్త్ర, ప్రయోగశాలలను, ప్రయోగశాలలో గల అధునాతన పరికరాలను విద్యార్థుల ప్రదర్శన నిమిత్తం ఏర్పాటు చేసి వాటి పనితీరులను వివరించారు. ప్రయివేట్ కళాశాలల కంటే అతి తక్కువ ఫీజులతో డిగ్రీ పూర్తి చేసుకునే అవకాశాన్ని, చదువుతో పాటు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునే అవకాశాలను, డిగ్రీ స్థాయిలో గల స్కిల్ కోర్సెస్, లైఫ్ స్కిల్ కోర్సెస్ గురించి విద్యార్థులకు వివిధ విభాగాల అధ్యాపకులు వివరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు 250 మందికి పైగా పాల్గొన్నారు.

ఏలూరు :స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఓపెన్ డే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్స్ పెంచడానికి ఉద్దేశించిన ఓపెన్ డేను కళాశాల విద్యా కమిషనర్ వారి ఆదేశానుసారం నిర్వహించారు. దీనిలో భాగంగా డిగ్రీ కళాశాల పరిధిలోని వివిధ జూనియర్ కళాశాలల విద్యార్థులను కళాశాలకు ఆహ్వానించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు కళాశాలలోని కోర్సుల గురించి, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కళాశాల చేస్తున్న కృషి గురించి వివరించారు. అనంతరం కళాశాలలోని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధ్యాపకులు విద్యార్థులతో సంభాషించారు.

22న రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నన్నయ యూనివర్సిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సమస్యలను పరిష్కరించాలని, యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకి నాని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 22వ తేదీన యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సు నన్నయ యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కరపత్రాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు.

ముళ్లపొదలు తొలగింపు

ప్రజాశక్తి - కైకలూరు

మార్కెట్ యార్డు ఆవరణలో సమస్యాత్మకంగా ఉన్న ముళ్ల పొదలను శుక్రవారం తొలగించారు. కమిటీ అధ్యక్షురాలు దండే పుష్పలత ఆధ్వర్యంలో జెసిబి ద్వారా ఆవరణలో దట్టంగా పేరుకుపోయిన కంపను తొలగించారు. కమిటీ ఉపాధ్యక్షులు జంపన కొండరాజు, కమిటీ సభ్యులు, అధికారులు పనులను పర్యవేక్షించారు.


'రాష్ట్రంలో సంక్షేమ పాలన'

ప్రజాశక్తి - చింతలపూడి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. స్థానిక షాదీ ఖానాలో నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమం చింతలపూడి మండల సచివాలయాల కన్వీనర్ చల్లా బత్తుల శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఎలిజా మాట్లాడుతూ అందరం కలసికట్టుగా పనిచేయాలన్నారు. 2024లో వైసిపి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో 175 సీట్లు సాధించి జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపిపి బి.రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు ములుగుమాటి నీరజ, చింతలపూడి పట్టణ కమిటీ అధ్యక్షులు కొప్పుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు



పోటీలను ప్రారంభిస్తున్న ధలరాం

మహాశివరాత్రి సందర్భంగా మండల కేంద్రమైన ముసునూరులో ఎంపిపి పాఠశాలకు ఎదురుగా ఉన్న ఆవరణలో ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు టిడిపి నాయకులు పాకనాటి సీతారం తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను శుక్రవారం టిడిపి మండల నాయకులు దేవినేని ధలరాం శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

యువత వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

యువత వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవాలని సెట్ వెల్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎండిహెచ్ మెహరాజ్ కోరారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ, సెట్ వెల్ వారి ఆధ్వర్యంలో శనివారపుపేట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కెరీర్ కౌన్సిలర్ ఆర్.విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లేందుకు లక్ష్యం కృషి ఉండాలన్నారు. పట్టుదలతో చదివి జ్ఞానం సంపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు బి.రాజేశ్వరి, లెక్కల మాస్టర్ కెఎస్‌వికె.రాజ్‌కుమార్, సెట్ వెల్ మేనేజర్ పివిఎన్.సత్యనారాయణ, ఎఒ కెజె కెనడి, పాఠశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

'కైకలూరు ఇన్‌ఛార్జి పదవి బిసిలకు కేటాయించాలి'

ప్రజాశక్తి - మండవల్లి

బిసిలకు సముచిత స్థానం కల్పించే విధంగా టిడిపి కైకలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలను మళ్లీ బిసి సామాజిక తరగతికే కేటాయించాలని బిసి సంక్షేమ సంఘం కైకలూరు నియోజకవర్గ అధ్యక్షులు సొంటి కుమారస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కైకలూరు మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ వెంకటరమణ వేరే పార్టీలో చేరారన్నారు. అయితే కైకలూరు నియోజకవర్గంలో 65 శాతం పైగా బిసి సామాజిక తరగతికి చెందిన ప్రజలు ఉన్నారన్నారు. గతంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు కైకలూరు నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసేందుకు బిసి సామాజిక తరగతికి చెందిన జయమంగళ వెంకటరమణకే సీటు ఇచ్చారన్నారు. దీంతో బిసిలంతా ఏకతాటిపైకి వచ్చి బిసి సామాజిక తరగతికి చెందిన వ్యక్తినే గెలిపించుకున్నారన్నారు. అంతేకాకుండా టిడిపిలోనే బిసిలకు ఒక ప్రత్యేక స్థానం ఉందని, బిసిల అభివృద్ధికి టిడిపి కట్టుబడి ఉందని పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఎప్పుడో స్పష్టం చేశారని ఆయన గుర్తు చేశారు. జయ మంగళ వెంకటరమణ పార్టీ మారడంతో ఇన్‌ఛార్జి పదవిని బిసిలకు కేటాయించి టిడిపికి బిసిలపై ఉన్న గౌరవాన్ని చాటాలని ఆయన కోరారు.

రహదారి అధ్వానం.. పట్టించుకునేవారేరి..!

పూర్తిగా పాడైపోయిన బుట్టాయగూడెం-దొరమామిడి రోడ్డు

ఇబ్బందుల్లో ప్రయాణికులు, వాహనదారులు

రోగులకు, గర్భిణులకు తప్పని అవస్థలు



గోతులతో అధ్వానంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం నుంచి దొర మామిడి వరకు ఉన్న సుమారు ఎనిమిది కిలోమీటర్ల ఆర్‌అండ్‌బి రోడ్డు పూర్తిగా పాడైపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు స్వగ్రామం దుద్దుకూరు ఈ రోడ్డు మీదుగానే వెళ్లాలి. ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఎంఎల్‌ఎ ఇంటికి ఈ రోడ్డు గుండానే వెళ్లాలి. ఎంఎల్‌ఎ ఇంటికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉన్నా పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అలివేరు, దొరమామిడి, లంకపాకల, చింతకొండ గొట్టాలరేవు, రేపల్లి, రేగులపాడు, గడిదబోరు, రంగాపురం, గుబ్బిసమామిడి, కొరసవారిగూడెం, బొడ్డేరు, గవరంపేట, చిన్నచిడిపూడి, పెద్ద జీడిపూడి, బోడిగూడెం, బండార్లగూడెం, గొట్టాలరేవి, గురుగుమిల్లి వంటి మారుమూల గిరిజన గ్రామాల గిరిజనులు ఈ రోడ్డు ద్వారానే ప్రయాణం చేస్తూ ఉంటారు. ఈ మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రజలు అనారోగ్యానికి గురైతే వైద్యం నిమిత్తం బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెంలోని ఆసుపత్రులకు ఈ మార్గం గుండానే వెళ్లాలి. ఈ రహదారి అధ్వానంగా ఉండడంతో రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. గిరిజన ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన గుబ్బల మంగమ్మ ఆలయానికి ఈ రహదారి మీదుగానే వెళ్లాలి. ఈ రహదారి పూర్తిగా పాడైపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు రామారావుపేట అంతర్వేది గూడెం కామవరం మీదుగా వెళ్లే రోడ్డును ఎక్కువగా వాడుతున్నారు. నిత్యం రాకపోకలు సాగించే రహదారి అధ్వానంగా ఉన్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి వాహనదారుల, రోగుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రహదారిని నిర్మించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి

ఎం.ప్రతాప్, పోలవరం నిర్వాసిత కాలనీ, సరుగుడు

రహదారి అధ్వానంగా ఉండడంతో అనారోగ్యంతో ఉన్న వ్యక్తులను వైద్యం నిమిత్తం, గర్భిణులను డెలివరీ నిమిత్తం ఆసుపత్రులకు తీసుకెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో దుమ్ము లేచిపోతుంది. దీంతో వెనక వచ్చే వాహనదారులకు రోడ్డు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి త్వరగా రోడ్డు నిర్మించాలి.

విఆర్‌కు కైకలూరు రూరల్ ఎస్‌ఐ

ప్రజాశక్తి - కైకలూరు

క్రమశిక్షణ చర్యల్లో భాగంగా కైకలూరు గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ చల్లా కృష్ణను విఆర్‌కు పంపించారు. ఈ మేరకు జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ ఆదేశాల జారీ చేసినట్లు రూరల్ సిఐ వైవిఎల్.నాయుడు తెలిపారు. పట్టణ మహిళా ఎస్‌ఐ కెవిఎస్.గాయత్రికి ఇన్‌ఛార్జిగా గ్రామీణ పోలీస్ స్టేషన్ బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

మహారాజశ్రీ ఏలూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టులో

E.P.No. 5/2021

O.S.No. 66/2017

Between:

టి.అర్జునరావు ...డి. హెచ్. ఆర్

AND

టి.భగవాన్ ...జె.డి.ఆర్

పై నెంబరు వారంటు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టులో **ది.13-03-2023న ఉదయం 10:30 ని॥ల నుండి బహిరగ వేలం వేయబడును.** కావున కావలసిన వారు సదరు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు

ప॥గో॥జిల్లా, భీమడోలు ఎస్.ఆర్.ఓ., భీమడోలు గ్రామం, ఆర్.ఎస్.నెం. 62/3బి, లో 101 చ॥గ॥ హౌస్ సైట్ 13వ బ్లాక్‌నకు హద్దులు:

East: Site Of Ghanta Ramu to some extent & Road to some extent.

South: Road.

West: Site of Vangalapudi Gotiyya.

North: Site of Thummagunta Geevan Prasad.

D.H.R. Value : Rs.3,00,000/-

Ammin Value : Rs.6,50,000/-

Sale on : 13-03-2023.

D.S.V.MANIKYALA RAO

Advocate, Power Pet,

Eluru. Cell: 94401 11466

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. నెం. 605/2021

Between:

బొద్దుల బంగారయ్య -వాది

మరియు

బొక్కా వరప్రసాద్ -ప్రతివాది

ప్రతివాది: బొక్కా వరప్రసాద్, తండ్రి: కృష్ణమూర్తి, హిందూ, పురుషుడు, ఇంటి నెంబరు: 1-48, పాలంగి, ఉండ్రాజవరం మండలం.

పై నంబరు దావా నందు ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారాను, రిజిస్టర్ పోస్టు ద్వారాను ఎన్నిమార్లు దావా సమన్లు పంపిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా అందుకుని యుండుటలేదు. కాబట్టి పై కోర్టు వారి ఎదుట **ది. 20-02-2023 ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయతు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి పై దావా నందు మీ యొక్క ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై నంబరు దావా తీర్మానం చేయబడునని ఇందు మూలముగా తెలియపరచడమైనది.

గాజుల వీర వెంకట అప్పాజి

సుంకర విజయ్‌కుమార్

తణుకు వాది తరపు న్యాయవాదులు

05-2-23 తణుకు, సెల్:9948809596

In The Court Of The Hon'ble First Additional Junior Civil Judge :: Eluru :: W.G.Dist

I.A.No. 206/2022

in O.S.No. 208/2022

Between:

Sri Muddana Leela Ram ...*Plaintiff*

AND

Sri Bethapudi Govinda Raju ...*Defendant*

పై నెంబరు దావాలో ప్రతివాది/డిఫెండెంట్ అయిన Sri Bethapudi Govinda Raju, S/o. Babu Rao, Hindu, Male, aged 38 Years, Resident of D.No. 5-94, Vempadu Village, Pedapadu Mandal, W.G.District అను మీకు వాదిగారు ఐ.ఎ.నెం. 206/2022 నందు మీకు సంబంధించిన దావా దాఖలా షెడ్యూలు స్థిరాస్తిని Attachment Before Judgement చేయుటకు, నోటీసులు కోర్టు నుండి అమలు నిమిత్తం పంపినప్పటికిని అమలు కాలేదు. కావున సదరు కేసు **ది.09-03-2023** నాటికి వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా రోజు మీరు ఉదయం గం॥10:00 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై కోర్టు వారు మీ పరోక్షమందు సదరు కేసు తీర్మానించెదరు. కావున మీకు తెలియపరచడమైనది.

(ది.08-02-2023వ తేదీ నాటి శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.వి.పి.మాధవరావు

అడ్వకేట్ & నోటరీ,

ఏలూరు, అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడరు,

10-2-23. ఏలూరు. సెల్: 94401 11033

In The Court Of The Hon'ble First Additional Junior Civil Judge :: Eluru :: W.G.Dist

I.A.No. 206/2022

in O.S.No. 208/2022

Between:

Sri Muddana Leela Ram ...*Plaintiff*

AND

Sri Bethapudi Govinda Raju ...*Defendant*

పై నెంబరు దావాలో ప్రతివాది/డిఫెండెంట్ అయిన Sri Bethapudi Govinda Raju, S/o. Babu Rao, Hindu, Male, aged 38 Years, Resident of D.No. 5-94, Vempadu Village, Pedapadu Mandal, W.G.District అను మీకు వాదిగారు ఓ.ఎస్.నెం. 208/2022 నందు దావా బాకీ రాబట్టుకొనుటకు, దావా సమనులు కోర్టు నుండి అమలు నిమిత్తం పంపినప్పటికిని అమలు కాలేదు. కావున సదరు కేసు **ది.09-03-2023** నాటికి వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా రోజు మీరు ఉదయం గం॥10:00 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై కోర్టు వారు మీ పరోక్షమందు సదరు కేసు తీర్మానించెదరు. కావున మీకు తెలియపరచడమైనది.

(ది.08-02-2023వ తేదీ నాటి శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.వి.పి.మాధవరావు

అడ్వకేట్ & నోటరీ,

ఏలూరు, అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడరు,

10-2-23. ఏలూరు. సెల్: 94401 11033